న్యూ ఇయర్ జోష్



పొదలకూరు: రావిఆకుపై శుభాకాంక్షలు

పొదలకూరు: నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం రాత్రి నుంచే వేడుకలు మొదలయ్యాయి. పట్టణంలోని స్వీట్స్ అండ్ బేకరీ షాపులు కిటకిటలాడాయి. ఆర్డర్లపై వ్యాపారులు కేక్‌లు తయారు చేసి అందించారు. 2025 సంవత్సరాన్ని స్వాగతిస్తూ జనం కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

⇨ నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య రావిఆకుపై చిత్రాన్ని వేశారు.

⇨ న్యూ ఇయర్ సందర్భంగా పట్టణంలోని విజేత స్కూల్లో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి కేక్ కట్ చేశారు. కరస్పాండెంట్ జి.కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

అగ్గిపెట్టెలో క్యాలెండర్

మనుబోలు: సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము అగ్గిపెట్టెలో పట్టే నూతన సంవత్సర క్యాలెండర్‌ను తయారు చేసి అబ్బురపరిచాడు. దీనిని మంగళవారం ఎంపీడీఓ జలజాక్షి ఆవిష్కరించారు.

బుచ్చిరెడ్డిపాళెం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని పట్టణంలోని స్వీట్స్ షాపులు కిటకిటలాడాయి. కొత్త బస్టాండ్ సెంటర్ నుంచి చెన్నూరు రోడ్డు, ముంబై రహదారిపై ఉన్న సుమారు 15 స్వీట్స్ షాపుల వద్ద ఇదే పరిస్థితి కనిపించింది.

⇨ నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాలను అలంకరించారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్న తరుణంలో అన్ని ఏర్పాట్లు చేశారు.



పొదలకూరు: వివిధ ఆకృతుల్లో తయారు చేసిన కేకులు



బుచ్చిరెడ్డిపాళెం: కిటకిటలాడుతున్న స్వీట్స్ షాపు



పొదలకూరు: అగ్గిపెట్టెలో పట్టే క్యాలెండర్



పొదలకూరు: స్కూల్లో వేడుకలు



బుచ్చిరెడ్డిపాళెం: శోభాయమానంగా వెంకటేశ్వరస్వామి ఆలయం

క్లుప్తంగా

దొరువులపాళెంలో 20 అర్జీల స్వీకరణ



సదస్సులో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

ముత్తుకూరు: మండలంలోని దొరువులపాళెం సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఇందులో 20 అర్జీలు అందాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు, అడంగళ్‌లో మార్పుల కోసం అర్జీలు వచ్చినట్టు డిప్యూటీ తహసీల్దార్ ప్రదీప్ వెల్లడించారు. రీ సర్వే డీటీ శ్రీనివాసులు, సర్వేయర్ అనురూప్, వీఆర్వో, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో పోలేరమ్మ

మనుబోలు: మనుబోలు దేవాంగుల వీధిలోని పోలేరమ్మ గుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. గంధళ్ల కృష్ణయ్య - అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

⇨ పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ వీర అభయాంజనేయస్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలలు జరిగాయి.

విద్యార్థులకు వాటర్ బాటిళ్ల అందజేత



ఇందుకూరుపేట: మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు తదితరాలను మంగళవారం పంపిణీ చేశారు. దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వీటిని అందజేశారు.

వృద్ధులకు పింఛన్ల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని 16వ డివిజన్లో వృద్ధులకు పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ ఆధ్వర్యంలో వీటిని అందజేశారు.

బీజేపీ మండలాధ్యక్షుడి ఎన్నిక



విడవలూరులో..

విడవలూరు: బీజేపీ మండలాధ్యక్షులను ఎన్నుకుంటున్నామని పార్టీ కోవూరు నియోజకవర్గ కన్వీనర్ ఇండ్ల వెంకటరాఘవయ్య పేర్కొన్నారు. మండలంలోని చౌకచర్లలో మంగళవారం నిర్వహించిన సభకు ఆయన హాజరయ్యారు. పార్టీ మండలాధ్యక్షుడిగా కొమ్మిరెడ్డి కోటారెడ్డిని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అనంతరం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. మండల ఎన్నికల అధికారి మిడతల రమేష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి అద్దంకి కార్తీక్, అత్తిరాల గిరీష్, తంబి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెంలో..

బుచ్చిరెడ్డిపాళెం: బీజేపీ పట్టణాధ్యక్షుడిగా రామిశెట్టి కల్యాణ్‌కుమార్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు సత్కరించారు.

బాలుడి ఆచూకీ లభ్యం

పొదలకూరు: పట్టణంలోని శివాలయం వీధిలో నివాసముంటున్న అభిలాష్ (9) సోమవారం సాయంత్రం అదృశ్యమయ్యాడని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. అభిలాష్ నెల్లూరులో 5వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు అతడిని ఇంటికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో కనిపించకుండాపోయాడని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతంలో ఆచూకీ గుర్తించారు.

తాటిపర్తిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తాం

• ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ

పొదలకూరు: తాటిపర్తి గ్రామంలో జ్వరాలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరపీడితులను గుర్తిస్తామని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలో వారంరోజులుగా జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ఖాదర్‌వలీ పరిశీలించేందుకు మంగళవారం విచ్చేశారు. ఈ సందర్భంగా మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఫీవర్ సర్వేను నిర్వహించి వైద్యశిబిరాన్ని కొనసాగించాల్సిందిగా ఆదేశించారు. గ్రామస్తులు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల ఉధృతి పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమతెరలను ఉపయోగించాల్సిందిగా సూచించారు. డీఎంహెచ్‌ఓ వెంట విస్తరణాధికారి రవికుమార్, మలేరియా అధికారి ఆంజనేయవర్మ ఉన్నారు.



ఫీవర్ సర్వే చేస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలి

ఇందుకూరుపేట: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. ఎంపీపీ గంధళ్ల శంకరయ్య, ఎంపీడీఓ నాగేంద్రబాబు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరికోట జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

పౌర హక్కుల దినోత్సవం



కొడవలూరు: ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ స్ఫూర్తి సూచించారు. మండలంలోని యల్లాయపాళెం తేళ్లమిట్ట గిరిజన కాలనీలో మంగళవారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. గిరిజనుల అభ్యున్నతికి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, అయితే వీటిపై అవగాహన లేక సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని చెప్పారు. దీనిపై అవగాహన కల్పించేలా అధికారులు కృషి చేయాలని కోరారు. పీఆర్ ఏఈ శ్రీనివాస్, ఏఓ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

కొడవలూరు: క్షయ, కుష్ఠుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ సూచించారు. మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ వ్యాధులపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అవగాహన కలిగి ఉంటే ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి సులువుగా నివారించొచ్చని చెప్పారు. వైద్యాధికారి కామాక్షయ్య, హెచ్‌ఈఓ కోటేష్, పరిమళ, ఏఎన్‌ఎంలు సుష్మ, సుకన్య పాల్గొన్నారు.

మినీ గోకులాల నిర్మాణానికి రూ.30 కోట్లు

• డ్వామా పీడీ గంగా భవానీ



పొదలకూరు: జిల్లాలో మినీ గోకులాల నిర్మాణాల కోసం రూ.30 కోట్లు మంజూరు చేసినట్టు డ్వామా పీడీ గంగా భవానీ తెలిపారు. పొదలకూరు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయానికి మంగళవారం పీడీ విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ మినీ గోకులాల కోసం పాడిరైతుల నుంచి 1,300 దరఖాస్తులు వచ్చాయన్నారు. పనులు ప్రారంభించామన్నారు. సంక్రాంతి నాటికి పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, వర్షాల కారణంగా కోవూరు, నెల్లూరు క్లస్టర్లలో ఉపాధి పనులు మందగించినట్టు తెలిపారు. ఉదయగిరి ప్రాంతంలో పనులు వేగంగా జరుగుతున్నట్టు వెల్లడించారు. గోకులాలకు సంబంధించి రెండు గేదెలున్న వారికి రూ.1.05 లక్షలు, నాలుగు గేదెలుంటే రూ.1.80 లక్షలు, ఆరు గేదెలుంటే రూ.2.30 లక్షలు నిధులు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం పంచాయతీరాజ్‌కు రూ.80 కోట్లు మంజూరు చేశారని, 1,135 పనులను గుర్తించామన్నారు. ఇందులో 5 శాతం కూలీలు, మిగిలిన 95 శాతం మెటీరియల్ కాంపోనెంట్ ఉంటుందన్నారు.

వెన్ను తీసిన పంట పరిశీలన



కొడవలూరు: జిల్లాలో ఆరెన్నార్ - 15048, కేఏన్నెమ్ - 1638 రకాలను ముందుగా వేసుకోవడంతో వెన్ను తీయాల్సి వచ్చిందని ఆత్మ పీడీ శివన్నారాయణ, ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కొడవలూరు, విడవలూరు, కోవూరుతో పాటు అనేక మండలాల్లో పలుచోట్ల వీటిని నాటిన 20 రోజులకే ముందస్తుగా వెన్ను తీయడంతో ఆందోళన చెందిన రైతులు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో గుండాలమ్మపాళెంలోని పంటను పరిశీలించారు. ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, రైతులు డేగా మధుసూదన్‌రావు, మురళీమోహన్‌రావు, దేవళ్ల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటపాళెం రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

ముత్తుకూరు: భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతిన్న పంటపాళెం రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. నిరంతరం టిప్పర్లు, లారీలు, బల్కర్లు ప్రయాణించడంతో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా బలిజపాళెం, సుబ్బారెడ్డిపాళెం, పంచాగ్నులవారికండ్రిగ, పంటపాళెం వద్ద రోడ్డుకు అడ్డంగా గుంతలున్నాయి. దీంతో వాహనాలు ప్రమాదాల బారినపడుతున్నాయి. గుంతలను పూడ్చే పనులను ప్రారంభించారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు: మండలంలోని ఇస్కపాళెం, చిన్నచెరుకూరుల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏఓ శిరీషారాణి మాట్లాడుతూ వీలైనంత వరకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ వీఏఏలు నిరూష, శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



విడవలూరులో..

విడవలూరు: మండలంలోని ఊటుకూరు, పెద్దపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడారు. యూరియాను అధిక మోతాదుల్లో వాడటం ద్వారా అగ్గి, పాముపొడ తెగుళ్లు, దోమపోటు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఎంపీఈఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: గండవరంలో..

కొడవలూరు: అధిక మోతాదులో యూరియాను వినియోగించడం అనర్థమని కోవూరు ఏడీఏ సుజాత పేర్కొన్నారు. మండలంలోని గండవరం, గౌతమ్‌నగర్‌లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలకు హాజరైన ఆమె మాట్లాడారు. శాస్త్రవేత్తలు సూచించిన మేరకే వరిలో యూరియాను వినియోగించాలని సూచించారు. పంట నమోదు తప్పనిసరనే అంశాన్ని గుర్తుంచుకోవాలని కోరారు. ఏఓ లక్ష్మి, సర్పంచ్ రాజకుమారి, ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు శ్రావ్య, కవిత పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి



ఇందుకూరుపేట: బాల్య వివాహాలను నిరోధించాలని సీడీపీఓ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని గంగపట్నంలో కిశోర వికాస కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 11, 14, 15, 18 ఏళ్ల బాలికలతో గ్రూపులను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేలా ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ పీఓ సమత, నీరజ, సూపర్‌వైజర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యం

• వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

వెంకటాచలం: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యమని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో మంగళవారం వీఎస్‌యూ అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు విద్యా ప్రమాణాలు పాటించాలని, పరిశోధనాత్మక శైలిలో విద్యాబోధన చేయాలని సూచించారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ విశ్వవిద్యాలయ మార్గదర్శకాలకు అనుగుణంగా కళాశాలలు పనిచేయాలన్నారు. విద్యా ప్రమాణాలను కాపాడటంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. అకడమిక్ విద్యాబోధనలో నూతన విధానాలను అందిపుచ్చుకుని విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించాలన్నారు. పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రక్రియలో పారదర్శకతను పాటించడం చాలా ముఖ్యమని తెలియజేశారు. సమావేశంలో పరీక్షల నియంత్రణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ తదితరులు పాల్గొన్నారు.



















